
ప్రజాశక్తి

బుధవారం 31 మే 2023

5


పార్వతీపురం మన్యం



5న జిల్లా సదస్సు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలోకి చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ సవర భాషా వాలంటీర్లను కేంద్రం నిలిపివేయడం, సిఆర్‌టి రిజర్వేషన్లపై జూన్ 5న గుమ్మలక్ష్మీపురంలో బిఎస్ఆర్ కల్యాణ మండపంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సదస్సుకు మాజీ ఎంపి మిడియం బాబురావు, ఎపి గిరిజన సంఘం ఉపాధ్యక్షులు వి.తిరుపతిరావు, ఆల్ ఇండియా ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ సెక్రటరీ నిమ్మల సురేష్ హాజరవుతున్నట్లు తెలిపారు.



పట్టణంలో ఊరేగుతున్న సిరిమాను

అంబరాన్నంటిన సంబరం

- ఘనంగా సిరిమానోత్సవాలు
- అలరించిన వేషధారణలు
- హోరెత్తించిన మందుగుండు సామాగ్రి
- 250 మంది పోలీసులతో బందోబస్తు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తొలిత పార్వతీపురం పట్టణంలో మంగళవారం ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ, బంగారమ్మ సంబరాలు అంబరాన్ని ఘనంగా అంటాయి. రెండు సినిమానోత్సవాలు, అమ్మవారుల ఘటాలు ఊరేగింపులో వేలాది మంది భక్తుల ఆనందోత్సవాలతో పార్వతీపురం సంబరాలు పరవశింపజేశాయి. మూడేళ్లకొకసారి జరగాల్సిన పండగ కరోనాతో ఏడేళ్లు తర్వాత పండగ జరపడంతో స్నేహితులు, బంధువులు అధిక సంఖ్యలో మూడు రోజుల ముందే చేరుకోవడంతో పట్టణం భక్తులతో కిక్కిరిసింది. ఉత్సవాలకు రెండు రోజుల ముందు నుంచే పల్సర్ బైక్ రమణ, డి ప్రోగ్రాం ఆర్టిస్టులతో భారీగా సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

అనుపోత్సవంలో కీలక ఘట్టమైన సినిమానోత్సవం

మంగళవారం సాయంత్రం 7.30 గంటలకు విద్యుత్ కాంతులతో అంగరంగ వైభవంగా సిరిమానోత్సవం ప్రారంభమైంది. ఎర్ర కంచెమ్మ గులకులానికి చెందిన నక్క శ్రీనివాసరావు సినిమాను అధిరోహించగా, జన్ని కులానికి చెందిన ఆరిక రాజారావు ఇప్పల పోలమ్మ సిరిమానును అధిరోహించారు. ఇప్పల పోలమ్మ సిరిమానోత్సవం పట్టణంలో రెడ్డి వీధి నుంచి బయలుదేరి, పట్టణ పోలీస్ స్టేషన్ వీధి నుంచి ప్రధాన రహదారి గుండా పాత బస్టాండ్ జంక్షన్ నుంచి దంగిడి బెలగాం చేరుకోగా, ఎర్ర కంచమ్మ సిరిమాను జగన్నాధపురంలో ప్రధాన రహదారి గుండా పోలీస్ స్టేషన్ వీధి నుంచి తిరిగి జగన్నాధపురం చేరుకుంది. ఈ రెండు ఉత్సవ కమిటీ నిర్వాహకులు భారీ ఏర్పాట్లతో ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు.

సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు

మంగళవారం ఉదయం నుండే ఎర్ర కంచమ్మ, ఇప్పలపోలమ్మ అమ్మవారి గుడిలను దర్శించుకునేందుకు భక్తుల తాకిడి పోటెత్తింది. మండుటెండలో భక్తులకు ఇబ్బంది కలగకుండా, మంచినీళ్ళు, మజ్జిగలు, పులిహోర ప్యాకెట్లు స్థానిక లైన్స్ క్లబ్ వారు, ఓం శాంతి వారు, యువకులు భక్తులకు సహాయ సహకారాలు అందించారు.

250 మంది పోలీస్ బందోబస్తు

భక్తుల తాకిడి పెరగడంతో శాంతిభద్రతలకు అవరోధాలు లేకుండా ఎఎస్‌పి ఆదేశాల మేరకు పట్టణ సిఐ ఆధ్వర్యంలో 250మంది పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది.



ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

అలరించిన సాంస్కృతి కార్యక్రమాలు

సినిమానోత్సవ ఊరేగింపునకు ముందుగా విజయనగరం గిరిజాల ఆదినారాయణ వారిచే పులి వేషాలు, బరంపురం వారిచే ధూమ్ తడాఖా నృత్యం, విశాఖ నుండి తీన్మార్, తాడేపల్లిగూడెం వారిచే కాంతారా, ఏలూరు వారిచే శక్తి వేషాలు, వీరఘట్టం గోవింద వారిచే భళా అనిపించే బల్ల వేషాలు అలరించగా కళ్ళ మేర మెట్లుగొలిపే వేటపాలెం వారిచే బాణసంచా కాంతులతో అదరహో అన్నట్లు భక్తుల ఆనందోత్సవాల్లో మునిగితేలారు.



ఉత్సవాల్లో అలరిస్తున్న విచిత్ర వేషధారణలు



ప్రధాన రహదారిలో విద్యుత్ కాంతులు మిలమిల



యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు



సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

- కార్మిక సమస్యలపై సిఐటియు అలుపెరుగని పోరు
- జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్

దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిక్కచ్చిగా పెద్ద ఎత్తున ఐక్యపోరాటాలు చేస్తున్నది సిఐటియునని జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు అనానరు. సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక సుందరయ్య భవనం వద్ద సిఐటియు జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భవించి 53 ఏళ్లుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు, పబ్లిక్ సెక్టార్ అమ్మేయడం, కార్మిక హక్కులు కాలరా స్తుందని వారు ఆరోపించారు. రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, డిఫెన్స్, విశాఖ స్టీల్ ప్లాంట్ బ్యాంక్‌లు, వివిధ రకాల ప్రభుత్వ సంస్థలను, ప్రకృతి సంపదను అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఎప్పటికప్పుడు ఆందోళన చేస్తుందన్నారు. ఇప్పటివరకు కార్మికుల పక్షాన దాదాపు 26 సమ్మెలు నిర్వహించిందన్నారు. ముఖ్యంగా బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం రెండు కలిపి కాంట్రాక్టు ఉద్యోగులను, స్కీం వర్కర్లను అన్యాయానికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేయడం, పెన్షన్ సౌకర్యం లేకుండా చేయడం వారికి రక్షణ లేకుండా, భద్రత లేకుండా ఇబ్బందులు గురి చేయడం దారుణమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమాలపై నిర్బంధ మోపుతున్నాయని, బ్రిటిష్ కాలం నటి జీవోలు తీసుకొచ్చి కార్మికుల్ని అణగదొక్కడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో సిఐటియు ఐక్యత పోరాటం నినాదంతో కార్మిక వర్గం మొత్తాన్ని ఒక్కటి చేసి విధానాలపై పోరాటానికి సిద్ధం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు. రాజు, గౌరినాయుడు, డి.ఆనంద తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

పురుగు మందుల స్ప్రేయింగ్‌లో
మరో అడుగు

- మండలానికి మూడు డ్రోన్ సిస్టమ్ హైరింగ్ సెంటర్లు
- 40శాతం సబ్సిడీతో డ్రోన్లు మంజూరు
- ఉచితంగా పైలెట్ శిక్షణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వ్యవసాయ యాంత్రీకరణలో ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేస్తోంది. దుక్కికోసం ట్రాక్టర్లు చాలా కాలం క్రితమే అందు బాటులోకి వచ్చాయి. గడిచిన దశాబ్దకాలంలో తేలికపాటి దుక్కికోసం మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, వరి కోత, కలుపుతీత, నూర్పిడి తదితరాలకు సంబంధించిన యంత్రాలు ఉనికిలోకి వచ్చాయి. వీటన్నింటినీ కలిపి కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల పేరిట రైతుమిత్ర సంఘాలకు సబ్సిడీపై మంజూరు చేసిన విషయం విధితమే. ఇప్పటికే 326 ఆర్‌బికెల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఉన్నాయి. మరో 184 హైరింగ్ సెంటర్‌లు జూన్ 1న యంత్రసేవ పథకంలో భాగంగా రైతు మిత్ర బృందాలకు పంపిణీ చేయనున్నారు. సుమారు రూ.12కోట్ల మేర సబ్సిడీ అందనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇదేమాదిరిగా పంటల సంక్షరణకు పురుగుల మందుల స్ప్రేయింగ్ కోసం డ్రోన్ సిస్టమ్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు ప్రజాశక్తికి స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం తొలిదశలో రాష్ట్ర వ్యాప్తంగా మండలానికి మూడు చొప్పున డ్రోన్లు మంజూరు చేయనున్నారు. ఆర్‌బికె ద్వారా కనీసం ఐదుగురు సభ్యులు కలిసి దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో డ్రోన్ విలువ సుమారు రూ.10లక్షలు కాగా, ఇందులో 40శాతం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో చెల్లిస్తుంది. మిగిలిన మొత్తాన్ని సభ్యులు పెట్టుకోవాల్సి ఉంటుంది. వీరిలో ఒకరికి డ్రోన్ నడిపేందుకు ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం సుమారు అయ్యే రూ.75వేల ఖర్చును కూడా వారే భరిస్తారు. శిక్షణ పొందబోయేవారు రైతు అయితే కనీసం పదో తరగతి, భూమిలేనివారైతే డిగ్రీ విద్యార్హత ఉండాలని నిబంధన పెట్టింది. పాస్‌పోర్టు తప్పనిసరి. శిక్షణ పూర్తయ్యాక కనీసం మూడేళ్లపాటు డ్రోన్ ఆపరేటింగ్ చేయాలని నిబంధన విధించింది. ఇప్పటికే జిల్లా నుంచి ఎనిమిది మంది దరఖాస్తు చేసుకుని శిక్షణకు కూడా వెళ్లారని అధికారులు చెబుతున్నారు. అన్ని మండలాల్లోనూ డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్లు అందుబాటులోకి వస్తే రైతులకు స్ప్రేయింగ్ సులభతరంగా కానుందని వ్యవసాయ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పురుగుమందు పిచికారీ చేస్తున్న డ్రోన్

క్రీడా మైదానాల జాడేది?

- అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం
- గిరి పుత్రులు రాణిస్తున్నా ప్రోత్సాహం కరువు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులకు చదువుతో పాటు మంచి క్రీడాకారులను తయారుచేయాలనే లక్ష్యం నీరుగారింది. పదేళ్ల క్రితం గుమ్మలక్ష్మీపురం, జియమ్మవలస మండలాల్లో క్రీడా పాఠశాలలు, మైదానాలు ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించి ఏళ్లు గడుస్తున్నా అవి నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాంతంలో వందలాది మంది ప్రతిభావంతులైన క్రీడాకారులున్నా వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో తమలోని ప్రతిభను బయటకు తీయలేక మరుగునపడుతున్నారు. విలువిద్య, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, జావాలింగ్‌త్రో , షార్ట్ పుట్ వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారు.

స్థల సేకరణతో సరి

గుమ్మలక్ష్మీపురం, జియమ్మవలస మండలం రావాడ రాంభద్రపురంలో క్రీడా పాఠశాలల ఏర్పాటుకు గతంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 12 ఎకరాల స్థలాన్ని రావాడలో కొంతమంది దాతలు విరాళంగా ఇచ్చారు. శాప్, ఐటిడిఎ అధికారులు స్థల పరిశీలన చేసి ప్రభుత్వానికి పలుమార్లు నివేదిక పంపించారు. జిల్లాకు ఒక పాఠశాల చొప్పున 2013లో మంజూరుకు లేఖ రాశారు. ఒక్కొక్క మైదానానికి అర ఎకరా స్థలంలో రూ.కోటీ 60 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులతో రన్నింగ్ ట్రాక్ కూడా నిర్మించారు. అంతా బాగానే ఉన్నా స్థల సేకరణతో సరిపెట్టిన అధికారులు పనులు మాత్రం నేటి వరకు చేపట్టలేదు.

పదహారేళ్ల కలగానే మినీ స్టేడియం

గుమ్మలక్ష్మీపురంలో ఉన్న హెచ్ గ్రౌండులో క్రికెట్ మినీ స్టేడియం పనులు నిర్మాణానికి గత పదహారేళ్లుగా ప్రతిపాదనలు చేసినా కలగానే మిగిలిపోయాయి. మొదటిసారి 2006లో అప్పటి సిపిఎం ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి మినీ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందుకోసం విజయనగరం నుంచి క్రీడా అధికారులు వచ్చి పరిశీలన కూడా చేశారు. అయితే క్రీడా మైదానం నిర్మాణానికి రూ.10 లక్షల వరకు అవసరం కాగా ఎమ్మెల్యే కోటా నుండి రూ.రెండు లక్షలు మంజూరు చేశారు. మిగతా రూ.8లక్షలు క్రీడా శాఖ అధికారులు మంజూరు చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. పనులు నేటికీ జరగలేదు. క్రీడా మైదానం సమీపాన టిడిపి హయాంలో 2018లో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రభుత్వం రూ.రెండు కోట్లు మంజూరు చేసింది. గుత్తేదారు పనులు ప్రారంభించి స్లాబ్ స్థాయి వరకు పనులు చేపట్టారు. అయితే ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లింపుల్లో జాప్యమైంది. దీంతో నాలుగున్నర ఏళ్లుగా ఇండోర్ స్టేడియం పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి.

జాతీయ స్థాయిలో రాణిస్తున్న గిరి పుత్రులు

గుమ్మలక్ష్మీపురం మన్యంలో చదువుతున్న విద్యార్థులు క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. కురాసింగికి చెందిన కరాటే క్రీడాకారిణి తోయక శిరీష శ్రీలంకలో సైతం మంచి ప్రతిభను కనబర్చారు. గతంలో బంగారు పతకం సాధించింది. గుమ్మ లక్ష్మీపురం, భద్రగిరి గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇప్పటికే వివిధ క్రీడల్లో రాణిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారు. క్రీడా శిక్షణ నిరంతరం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలమని ధీమాను క్రీడాకారులు వ్యక్తం చేస్తున్నారు. కనుమరుగవుతున్న క్రీడలకు జీవం పోయాలంటే క్రీడా శిక్షణ తప్పనిసరిగా ఉండాలని ఆశిస్తున్నారు.



విలువ విద్యలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

వీరఘట్టంలో ఉరుములు మెరుపులతో వర్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గత వారం రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ప్రజలు ఎండ వేడిమి తట్టుకోలేక అల్లాడిపోతున్న తరుణంలో మంగళవారం సాయంత్రం ఆకాశంలో ఒక్కసారి మార్పు రావడంతో ఉరుములు మెరుపులతో వర్షం కురవడం ప్రజలు భయభ్రాంతు గురై ఇళ్ల నుంచి బయటికి రాలేకపోయారు. కురిసిన వర్షాలు కారణంగా రహదారులు అధ్వానంగా తయారవడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు .

ఉద్యోగుల సామూహిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ ఉద్యమ పిలుపులో భాగంగా మంగళవారం అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద సామూహిక నిరాహార దీక్ష ఏర్పాటు చేయడమైనది. ఇందులో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన నిరాహార దీక్షలో జిల్లా చైర్మన్ గొట్టాపు శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శి డి.జి.ప్రసాద్, సహాధ్యక్షులు మరిపి శ్రీనివాసరావు, కో చైర్మన్ ఆర్.రమణమూర్తి, జి.చంద్రమౌళి, కార్యదర్శి వి.గౌరునాయుడు, రెవెన్యూ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు ఎ.సూర్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ షేక్ ఇబ్రహీం, ఉపాధ్యక్షులు శ్రీమతి పి.చిట్టెమ్మ, పాలకొండ డివిజన్ కార్యదర్శి సన్యాసిరావు, బుచియ్య, హెచ్ఎంల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, క్లాస్-4 అసోసియేషన్ కార్యదర్శి సింహాచలం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్, ఇతర సంఘాల బాధ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సామూహిక నిరాహారదీక్షలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు

టిడిపి మేనిఫెస్టోతో వైసిపి గజగజ : సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టో చూసి జగన్ అండ్ కో గజగజలాడుతోందని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని మరుపల్లి పంచాయతీ గంగన్నదొరవలసలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే సంక్షేమం, అభివృద్ధి అని, టిడిపి అంటేనే పేద, బడుగు బలహీనర్గాల పార్టీ అని పేర్కొన్నారు. మహిళల కోసం మహాశక్తి యువత కోసం యువగళం రైతుల కోసం అన్నదాత , 18 - 59 ఏళ్ల మహిళలకు ఆడబిడ్డ నిధితో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు ప్రకటించడంతో వైసిపికి ఏం చేయాలో తెలియని అయోమయంలో పడ్డారని విమర్శించారు. జగన్ వ్యర్థంగా చేస్తున్న ఖర్చుతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయవచ్చని అన్నారు. చంద్రబాబును సిఎం చేయడానికి మనమంతా సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తొత్తడి నారాయణమ్మ, నూకరాజు, కొట్టిశా గోపాల్, రామన్నదొర, వెంకటరమణ, అన్నపూర్ణ, శారద, లక్ష్మి, నారాయణ, రామారావు పాల్గొన్నారు

సీతంపేట : మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో చూసి వైసిపి ఉలిక్కిపడి నట్లుందని టిడిపి నియోజకవర్గ నాయకులు పడాల భూదేవి అన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టిడిపికి వస్తున్న ప్రజాదరణ చూసి వైసిపి ఓర్వలేక విమర్శలకు దిగుతుందన్నారు. మహిళలకు ఇచ్చే మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత ప్రయాణంపై విమర్శలు చూస్తుంటే మహిళలపై వైసిఎంకి ఎంత గౌరవం ఉందో అర్థమవుతుందన్నారు. కోడి కత్తి డ్రామాలాడి, తండ్రి మరణం, తల్లి, చెల్లిల ముసలి కన్నీరు వాడుకొని అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి పాలన గూర్చి నీతులు చెప్పొద్దన్నారు. పాలకొండ నియోజకవర్గం లో అభివృద్ధి కుంటిపడిందని ఆరోపించారు. గిరిజనులకు అందాల్సిన సబ్సిడీలు ఇప్పుడేమైపోయావో చెప్పాలన్నారు. టిడిపి హాయంలో గిరిజన సంక్షేమానికి వచ్చే నిధులు, ఇప్పుడు వైసీపీ ఇచ్చే నిధులపై చర్చించాలని డిమాండ్ చేశారు.

నవశకానికి నాంది : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన నవశకానికి, నవయుగానికి నాంది పలికిందని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా మంగళవారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. వైసిపి యువజన విభాగం జోనల్ ఇంఛార్జి అవనాపు విక్రం డిప్యూటీ సిఎం రాజన్నదొరకు కేక్ కట్ చేసి తినిపించారు. అనంతరం ఆయన పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కష్టాలు, సమస్యలు వింటూ పాదయాత్ర చేసిన జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు' నేనున్నాను'అని భరోసా కల్పించారని చెప్పారు. టిడిపి హయాంలో రాష్ట్రం జిడిపి వృద్ధి కన్నా ఇప్పుడు బాగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, వైసిపి పట్టణ మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, జగనన్న సచివాలయాల కన్వీనర్ గిరిరఘు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కురుపాం : అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు నేరుగా అందించి పేదవాని గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోవడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం స్థానిక కోపరేటివ్ బ్యాంక్ సమీపంలో గల గ్రౌండ్ వద్ద కేక్‌ను కట్ చేసి పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మన్యం జిల్లా వైసీపీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఐదు మండలాల ఎంపిపిలు, జడ్పీటీసీలు, కన్వీనర్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు నాయకులు ,కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

ముగిసిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల ఉపాధ్యాయులు, నాలుగో తరగతి ఉద్యోగుల కౌన్సిలింగ్‌కు 77మంది హాజరు కాగా, 40 మందికి బదిలీలయ్యాయి. డిడి బి.నగేష్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా బదిలీలు కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనల ప్రకారం బదిలీలు కౌన్సిలింగ్ జరిగింది. అనంతరం బదిలీ అయిన ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ ఒఎస్‌డి ఎం.యుగంధర్, ఎఎంఒ పి.కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ, ఎటిడబ్ల్యుఒ శ్రీనివాస్, మంగవేణి సూపరింటెండెంట్ తెలిపారు.



ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేస్తున్న డిడి నగేష్


సమావేశంలో మాట్లాడుతున్న జెసి విష్ణుచరణ్

అందరికీ ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

అడిగిన అందరికీ వెంటనే ఉపాధి కల్పించేందుకు పనులు గుర్తించి సిద్ధంగా ఉంచాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. సహాయ ప్రాజెక్టు అధికారులు, సహాయ ప్రాజెక్టు అభివృద్ధి అధికారులతో కలెక్టరు కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పెద్ద ఎత్తున జరగాలని ఆయన ఆదేశించారు. ఐటిడిఎ పరిధిలో ఉపాధి హామీ పనుల జాబితా సిద్ధంగా ఉండాలని, ప్రస్తుతం ఉపాధి పనులు చేసేందుకు మంచి సమయమని కూలీల సమీకరణ పెద్ద ఎత్తున జరగాలని ఆయన అన్నారు. కనీస వేతనం ప్రతి ఒక్కరూ పొందేలా కొలతలు ఇచ్చి పనిచేయించాలని, అవగాహన పెంపొందించాలని ఆయన చెప్పారు. సామాజిక తనిఖీల కార్యాచరణ సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. మొక్కలు నాటాలని అందుకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయడంలో సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఆధార్ అనుసంధానం జరగాలన్నారు.

కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి -కొమరాడ

వడ దెబ్బకుక మృతి చెందిన ఉపాధి కూలీ ఈదల సీతయ్య కుటుంబాన్ని అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులకు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి వినతిని అందజేశారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలోని కోటిపాం పంచాయతీ గుంపగద బవలసకు చెందిన ఈదల సీతయ్య సోమవారం తమ తోటి ఉపాధి కూలీలతో కలిసి చెరువు పనులకు వెళ్లి పని ముగించుకొని ఇంటికి వచ్చి గడపలోనే సొమ్మసిల్లి పడిపోయాడన్నారు. వెంటనే కుటుంబీకులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఆయనకు భార్య లక్ష్మితో పాటు నలుగురు పిల్లలు ఉన్నారని, ఇంటికి పెద్దదిక్కు చనిపోవడంతో కుటుంబమంతా రోడ్డున పడే పరిస్థితి ఉందని అన్నారు. కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సీతయ్య కుటుంబాన్నికి రూ.30 లక్షల నష్టపరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోటిపాం వైస్ సర్పంచ్ ఎం.చంటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిడుగుపడి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

పిడుగు పడి ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని కిచ్చాడ పంచాయతీలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం కిచ్చాడ పంచాయతీలోని గల చట్టిపుడొర వలస గ్రామానికి చెందిన ఎజ్జి జ్యోతి(35), ఎజ్జి రామలక్ష్మి (37), ఎజ్జి అనూష(17) వారి ఇంటి సమీపాన పిడుగుపడింది. దీంతో వారు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే వీరిని 108లో స్థానిక సిహెచ్‌సికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నారు.

గిరిజన సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

కురుపాంలో జూన్ 16,17 తేదీల్లో జరుగు ఏపి గిరిజన సంఘం జిల్లామహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని రావాడ రామభద్రపురంలో గిరిజన సంఘం మండల సమావేశం మంగళవారం సంఘం మండల కార్యదర్శి కూరంగి సీతారాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను అన్ని విధాలా అన్యాయం చేస్తున్నాయన్నారు. పాలకుల కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు చేస్తూ, గిరిజనుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈ విధానాలు అమల్లైతే గిరిజనులు ఉనికికే ప్రమాదమని, కావున గిరిజనులంతా కలిసికట్టుగా గిరిజన చట్టాలు, హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, గిరిజన సంఘం మండల నాయికులు గోరపాడు సోమయ్య, కొండగొర్రి సుబ్బారావు, కర్రక బలరాం, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు భూతల మోహన్ రావు పాల్గొన్నారు.

మంచినీటి కుళాయి ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అప్పయ్యపేటలో మంచినీటి కుళాయిని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి సమస్యను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకొచ్చి నిధులు మంజూరు చేయించి సకాలంలో పనులు పూర్తి చేయించి నీరు అందించినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ గ్రామంలో 1400 మీటర్లు మురుగు నీటి కాలువల నిర్మాణం పూర్తి చేశామని, అలాగే గ్రామంలో ప్రధాన రహదారి కాలువలు నిర్మాణం కూడా త్వరలో చేపడుతున్నామని అందుకు మీరంతా సహకరించాలని ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. అలాగే కాలువలు, రోడ్డు నిర్మాణం పూర్తి చేసిన వెంటనే ఇంటి ఇంటికి కుళాయిల ద్వారా మంచినీరు అందిస్తామని తెలిపారు. మీ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తానెప్పుడూ సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమ, సూర్యనారాయణ, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.


వెంకటరమణను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రామకృష్ణ

99వ సారి రక్తదానం

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురంలోని రాయగడ రోడ్, వివేకానంద కాలనీ, జనతావీధి నివాసి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సేవకులు, కళింగ వైశ్య సంఘం సభ్యులు వారణాసి వెంకటరమణ మంగళవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణి కోసం బ్లడ్ బ్యాంకులో 99వ సారి రక్తదానం చేశారు. ఈ మేరకు వెంకటరమణకు రోగి బంధువులు, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్లు బోటు రామకృష్ణ, తాడి రమేష్ (రిటైర్డ్ ఆర్మీ) అభినందనలు తెలిపారు.

సైనిక పాఠశాలలో ' తిరుమల సాయి' విద్యార్థికి సీటు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస



మండలంలో పెదమేరంగి జంక్షన్లో గల తిరుమల సాయి విద్యార్థినికి సైనిక పాఠశాలలో సీటు సంపాదించినట్లు పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ రౌతు వెంకటరమణ, హెచ్ఎం కర్రి శ్రీరామ్మూర్తి నాయుడు తెలిపారు. పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న తాన్న భాగ్యశ్రీలక్ష్మి సైనిక పాఠశాల వారు నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షల్లో సీటును పొంది రాష్ట్రంలోనే మొదటి ర్యాంకును సంపాదించి దాద్రా నగర్ హవేలీలో గల సైనిక పాఠశాలలో సీటును పొందిందని వారు తెలిపారు. భాగ్యశ్రీ లక్ష్మి తల్లిదండ్రులు గుమ్మలక్ష్మీపురం మండలంలో వైద్యశాఖలో పనిచేస్తున్నారని తెలిపారు. సైనిక పాఠశాలలో సీటు సంపాదించిన భాగ్యశ్రీలక్ష్మికి పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరళకుమారి, వెంకటరమణ, హెచ్ఎం శ్రీరామ్మూర్తి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థలతోనే పేదలకు మేలు

పలుచోట్ల ఘనంగా సిఐటియు ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వ రంగ సంస్థలతోనే పేదలకు మేలు జరుగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు అన్నారు. మంగళవారం సిఐటియు ఏర్పడి 53ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణ నాయకులు టి.శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ సిఐటియు అధ్యక్షులు టి.వెంకటరావు సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్వై నాయుడు మాట్లాడుతూ అసంఘటిత రంగం, మధ్యతరగతి ఉద్యోగుల ఐక్యం చేసి సిఐటియు అనేక పోరాటాలు చేసిందని చెప్పారు. బ్యాంకింగ్, రైల్వే, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రయివేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే వాటిని వ్యతిరేకిస్తూ సిఐటియు పోరాడుతున్నదని చెప్పారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తున్నదని, ఆ విధానాలను ప్రతిఘటిస్తూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విశ్వేశ్వరరావు, స్వప్న, టి.రవి పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిఐటియు ఆవిర్భావ దినోత్సవ ఘనంగా జరిగింది. సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970 మే 30న తారీఖున కలకత్తా నగరంలో సిఐటియు ఆవిర్భవించిందని, ఈ 53 ఏళ్ల కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్ అమ్మేయడం, కార్మిక హక్కులు కాలరాస్తుందని వివరించారు. ఇప్పటివరకు కార్మికుల పక్షాన దాదాపు 26 సమ్మెలు నిర్వహించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు ఉద్యోగులను, స్కీం వర్కర్లను అన్యాయానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటి జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మ ల మన్మధ రావు రాజు వివిధ కార్మికులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గరుగుబిల్లిలో వివిధ రంగాల కార్మికులతో సదస్సు జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ సిఐటియు విశిష్టతను కార్మికులకు వివరించారు. కార్మిక వర్గం తమ హక్కుల సాధించుకోవాలంటే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమానికి ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, కళాసీలు, గ్రామీణ పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో గాంధీ బొమ్మ వద్ద సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటియు మండల నాయకులు చింత పోలిరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జెండాను శ్రామిక మహిళా నేత టి.ప్రభావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, టి.ప్రభావతి మాట్లాడుతూ బిజెపి అవలంభిస్తున్న ప్రమాదకరమైన విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సంఘటిత పోరాటం చేసి హక్కులను సాధించుకోవాలని సిఐటియు ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు గనుతూరు రామారావు, గ్రీన్ అంబాసిడర్ల నాయకులు నిమ్మకాయల సుందరరావు, ఎంపిటిసి సభ్యులు సత్యవతి, గిరిజన సంఘం నాయకులు దీసరి వసంతరావు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు



సాలూరు : సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న ఎన్‌వై నాయుడు

కొమరాడ : మండల కేంద్రమైన సిఐటియు జెండాను నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ ఆర్.రాజేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు దుర్గ, అంగన్వాడీ యూనియన్ నాయకులు అనురాధ, ఆటో యూనియన్ నాయకులు వెంకట్రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల రెడ్డి శివున్నాయుడు, రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, భవన కార్మికుల సంఘం నాయకులు గౌరునాయుడు మాట్లాడుతూ సమస్యలపైన రాబోయే రోజుల్లో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్తులో జరిగే పోరాటాలకు కార్మికులంతా ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

మక్కువ : మండలంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రచ్చబండ దగ్గర జెండా ఎగరవేశారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు గునాల కృష్ణ ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు. సిఐటియు సీనియర్ సభ్యులు ఎల్ దాలమ్మ జెండా ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు సిహెచ్ తవిటి నాయుడు పాల్గొన్నారు. భవిష్యత్తులో ఐక్య పోరాటం కోసం అంతా సిద్ధం అవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పద్మ, అలేఖ్య, గంట సాంబమూర్తి, పవన్ కల్యాణ్, రవి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


బలిజిపేటలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ


పాచిపెంటలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న ప్రభావతి


గరుగుబిల్లి : సదస్సులో మాట్లాడుతున్న బివి రమణ

సమస్య తీర్చమంటే దాడులా? : జనసేన

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక సమస్య తీర్చమంటే వైసిపి నాయకులు దాడులు చేస్తారా అని జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు ప్రశ్నించారు మంగళవారం స్థానిక జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని బర్లిలో ఎమ్మెల్యే జోగారావు పర్యటన నేపథ్యంలో జనసేన మండల అధ్యక్షుడు బంకురు పోలినాయుడు, జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి గంట్యేడ స్వామి నాయుడు బర్లిలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించగా, ఆయనతో పాటు ఆయన అనుచరులు బుడిత కృష్ణ, పాలవలస మురళి దుర్భాషలాడుతూ జనసేన నేతలపై భౌతిక దాడికి దిగారన్నారు. ఈ వైసిపి వాళ్ల ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడం కాదా అని బాబు పాలూరు ప్రశ్నించారు. మీ జగన్ రెడ్డి "పేదలకు పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధం" అంటూ వింత నాటకాలు ఆడుతూ విపక్షాలపై వ్యంగ్యంగా బ్యానర్లు పెట్టిస్తూ ప్రజలను మోసం చేస్తుంటే ఈ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు మాత్రం ప్రజల తరపున సమస్యలపై నిలదీసిన సామాన్య కార్యకర్తలు, ప్రజల మీదకి భౌతిక దాడులకు దిగుతున్నారని, ఎమ్మెల్యే చుట్టూ దొంగ నోట్లు చలామణి చేసేవాళ్లని, రియల్ ఎస్టేట్ దందా నిర్వహించే పెత్తందార్లను పెట్టుకుని వైసిపి ప్రభుత్వం పేదవాళ్లపై యుద్ధం చేస్తుందని ఎద్దేవా చేశారు. ఈ విషయం ప్రజలు గ్రహించారు కాబట్టే మీరు ఎక్కడకి వెళ్లినా తిరుగుబాటు చేస్తున్నారని బాబు పాలూరు దుయ్యబట్టారు. నిన్నటి భౌతిక దాడి అంశాన్ని ఊరికే వదిలిపెట్టమని, దాడి చేయడమే కాకుండా బంకురు పోలినాయుడు కుటుంబ సభ్యులను పిలిచి బెదిరించడం కూడా చేశారని, ఈ విషయంపై స్థానిక ఎస్ఐకు ఫిర్యాదు చేశామన్నారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడితే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వైసిపి దాడులపై బుధవారం నిరసన దీక్షలు చేపట్టనున్నట్టు తలెఇపారు. విలేకరుల సమావేశంలో బంకురు పోలినాయుడు, గంట్యేడ స్వామినాయుడు, రగుమండ అప్పలనాయుడు, ఆదినారాయణ, మామిడి సత్యనారాయణ, శ్రీను, సంతోష్, అచ్యుత, రాజు తదితరులు పాల్గొన్నారు.

దాడులకు అక్కివరపు ఖండన

సమస్యలు పరిష్కరించాలని కోరిన జనసేన నాయకులపై ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడికి పాల్పడడం హేయయమైన చర్య అని జనసేన పార్వతీపురం నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహనరావు ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సింధు నగరంలో ఫ్యామిలీ డాక్టర్


ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం పంచాయతీ పరిధి సింధు నగరం గిరిజన గ్రామంలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి పి.ఉమామహేశ్వరి చంటి పిల్లలు, గర్భిణీలు, జ్వర పీడితులు తదితరులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఎండల తీవ్రత వల్ల వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని, ఉపశమనం పొందే పానీయాలతో పాటు బయటకు వచ్చేటప్పుడు గొడుగు వేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంత కుమారి, ఎంఎల్ హెచ్పి, టెక్నీషియన్, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో రాజేశ్వరి పతకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల క్రీడా కారిణికి కాంస్య పతకం లభించింది. మంగళవారం ఉత్తర ప్రదేశ్ నోయిడాలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల బైరెడ్డి వీధికి చెందిన క్రీడా కారిణి బైరెడ్డి రాజేశ్వరి ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధంచింది. 45కిలోల విభాగంలో రాజేశ్వరి స్నాచ్ 60కిలోలు, జర్క్ 79కిలోలు బరువెత్తి కాంస్య పతకం సాధించింది. ఈ సంధర్భంగా ఆమెను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.



వాలంటీర్లకు సన్మాన పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

'వాలంటీర్లకు వందనం'

ప్రజాశక్తి - సీతానగరం

వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, గ్రామ వాలంటీర్ల వ్యవస్థలు జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికలని, వారి సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అన్ని కార్యక్రమాల్లో వారినే ముందంజలో ఉంచుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన మండలంలోని పెదభోగిలి-1, అంటిపేట, కాశాపేట, లచ్చయ్యపేట, పెదభోగిలి-2, చినబోగిలి, తామరఖండి, బగ్గందొరవలస, గెడ్డలుప్పి, జోగంపేట, రంగంపేట, దయానిధిపురం, ఆర్ వెంకమ్మపేట, గాదెలవలస గ్రామ సచివాలయంల పరిధిలోని 24గ్రామ పంచాయతీలకు చెందిన 194మంది గ్రామ వాలంటీర్లకు వందన కార్యక్రమం ద్వారా ఘనంగా సత్కరించారు. గత మూడేళ్లుగా వాలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పేరిట ప్రభుత్వం సత్కరించడం ఎంతో గర్వకారణమన్నారు. మండలంలోని ఇద్దరు వాలంటీర్లకు సేవావాలంటీర్లను సచివాలయాల వారీగా శాలువా కప్పి, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. రానున్న సాధారణ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో వాలంటీర్లకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయసలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, జెడ్పీటీసీలు బాబ్జి, రవికుమార్, బలగ రేవతమ్మ, సీతానగరం, బలిజి పేట, పార్వతీపురం మండలాల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, పి.మురళీకృష్ణ, బొమ్మి రమేష్, ఎంపిపిలు మజ్జి శోభాలత, గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపిలు సూర్యనారాయణ, సిద్దా జగన్నాధం, వెలిది సాయిరాం, పోల ఈశ్వర నారాయణ, సురగాల గౌరికిరణ్, బురిడి సూర్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు, 35గ్రామ పంచాయతీల కార్యదర్శులు, కీలకనాయకులు, కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి అభిమానులు, సోషల్ మీడియ కన్వీనర్లు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ప్రజాశక్తి - జియ్యమ్మవలస


వేతనదారులనుద్దేశించి మాట్లాడుతున్న గంగునాయుడు

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి గంగు నాయుడు అన్నారు. ఉపాధి సమస్యలపై మంగళవారం ఉపాధి పనులు కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. జాబ్ కార్డు దారులందరికీ పని కల్పించాలంటే కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల 70 వేల కోట్ల నిధులు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.60వేల కోట్లే ప్రభుత్వం నిధులు కేటాయించారన్నారు. నిధులు తగ్గించడమంటే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడమేనన్నారు. రెండు పూటలా పని పెట్టి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తూ మజ్జిగ, మంచి నీరు, మెడికల్ కిట్లు, టెంట్లు ఇవ్వడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఎంతో కీలకమైన పథకాన్ని ఎత్తి వేయడమంటే నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేయడమేనన్నారు. కావున వ్యవసాయ కార్మికులంతా ఐక్యంగా పోరాడి ఈ చట్టాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి భూతల మోహనరావు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

బలిజిపేట : మండలంలోని తుమరాడ దగ్గర చెరువులో ఉపాధి కూలీలతో రైతు సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడారు. ఉపాధిహామీ చట్టాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ కూలీలతో బలవంతంగా రెండుపూటలు ఉపాధి పనులు చేయిస్తున్నారని, ప్రజలు ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. గతంలో టెంట్లు, గడ్డపారలు, గునపాములకు, తాగునీటికి సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారని ఇప్పుడు అవి కూడా ఇవ్వడం లేదన్నారు. బడ్జెట్లో నిధులు భారీగా తగ్గించారని అన్నారు. కావున ఉపాధి హామీని రక్షించుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు

డిప్యూటీ సిఎంకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి బైక్ ర్యాలీలో స్వల్పంగా గాయపడిన డిప్యూటీ సిఎం రాజన్నదొరను మంగళవారం బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పరామర్శించారు. ఆయన నివాసంలో కలిసి ఎలా గాయపడిందీ అడిగి తెలుసుకున్నారు. వైసిపి యువజన విభాగం జోనల్ ఇంఛార్జి అవనాపు విక్రం కూడా రాజన్నదొరను పరామర్శించారు. వారితో పాటు బొబ్బిలి జెసిఎస్ కన్వీనర్ తమ్మారెడ్డి దామోదర్ వున్నారు.

వెల్‌నెస్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం


రికార్డులను పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహన్

మండలంలోని మరిపివలస, జోగింపేట, పెదబోగిలిలో హెల్త్ వెల్నెస్ కేంద్రాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారీ రోగుల ఆరోగ్యం, ఒపి రికార్డులు, గర్భిణీ వివరాల నమోదు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం రికార్డులు, వైద్య పరికరాలు, మందులు, వైద్య పరీక్షలు తదితర రికార్డులు పరిశీలించారు. జ్వర లక్షణాలతో కేంద్రానికి వచ్చిన వారికి వెంటనే నిర్ధారణ పరీక్షలు జరిపి పర్యవేక్షణ చేయాలన్నారు. అక్కడ అందజేస్తున్న వైద్య సేవలు వివరాలు పోస్టర్‌గా ప్రదర్శించాలన్నారు. వైద్య పరికరాలు పరిశీలించి ఆయా సందర్భాల్లో వీటిని వినియోగించాలన్నారు. మందులను రోగాల వారీగా అమరిక పద్ధతిలో ఉంచాలన్నారు. అనంతరం టెలీహబ్ ద్వారా అందజేస్తున్న సేవలను పరిశీలించారు. అత్యవసర వైద్య సేవలపై ఎంఎల్ హెచ్ పి (సిహెచ్ఒ)లకు ప్రస్తుతం శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో సాధారణ రోగాలతో పాటు అత్యవసర చికిత్స కూడా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటాయని, సిబ్బంది విధుల్లో అందుబాటులో ఉండాలని అన్నారు. వెల్నెస్ కేంద్రాల ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవల్ని పూర్తి స్థాయిలో అందజేసి వివరాలు ఎప్పటికప్పుడు పక్కగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి (సిహెచ్ఒ)లు శ్రావణి, లావణ్య, సునీత, ఎఎన్ఎంలు గౌరి, చైతన్య, సిబ్బంది దుర్గాప్రసాద్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

జూలై 20నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలోని నిరుద్యోగుల కోసం అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ విజయనగరం జిల్లాలో నిర్వహిస్తునట్లు ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ వినయ్ కుమార్ తెలిపారు. మొదటి దశ లో రాత పరీక్ష, ఇందులో ఉత్తీర్ణులైన వారికీ రెండవ దశలో శారీరక సామర్థ్యం , వైద్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాత పరీక్ష ఇప్పటికే పూర్తి అయ్యిందని, 10 వేల మంది ఈ ఆన్‌లైన్‌లో ఎంపికయ్యారని, వీరికి శారీరక, వైద్య పరీక్షలు విజయనగరం పిటిసి గ్రౌండ్‌లో జరుగుతుందని అన్నారు. మంగళవారం కల్నల్ వినయ్ కుమార్ కలెక్టర్ నాగలక్ష్మిని కలసి ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి అవసరమైన ఏర్పాట్లను, ఇతర లాజిస్టిక్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులందరితో త్వరలోనే సమావేశం నిర్వహించి ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ర్యాలీలో పాల్గొను అభ్యర్థులకు అడ్మిట్ కార్డులు ఇవ్వాలన్నారు. జెసి మయూర్ అశోక్, సహాయ కలెక్టర్ త్రివినాగ్, డిఆర్ఒ గణపతిరావు, సెట్విజ్ సిఇఒ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కురుపాం :



స్థానిక గాంధీనగర్ కాలనీలో చెందిన గరుగుబిల్లి నేహా(15) రెండు రోజులుగా కనిపించడంలేదని ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బంధువులు, తెలిసినవారు ఇళ్లల్లో వెతికిన కనిపించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కురుపాం ఇంఛార్జి ఎస్సై అనిల్ కుమార్ పేర్కొన్నారు.